# సాక్షి రంగారెడ్డి

శుక్రవారం। 7। ఫిబ్రవరి। 2025






**సంపూర్ణ ఆరోగ్యంతోనే..**

విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉన్నప్పుడే సత్ఫలితాలు సాధిస్తారని ఎన్ఐఆర్డీ ప్రొఫెసర్ వాణిశ్రీ అన్నారు. 8లో▸



**డిమాండ్లు పరిష్కరించాలి**

రెండో ఏఎన్ఎంల డిమాండ్లను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతాలు అన్నారు. 8లో▸



**జీతాలు లేవు**

తొమ్మిది నెలలుగా తమకు జీతాలు చెల్లించడంలేదని కమ్మగూడలోని చిల్డ్రన్ హోమ్ సిబ్బంది ధర్నా చేపట్టారు. 8లో▸

## న్యూస్‌రీల్

### ఉద్యోగాలివ్వండి

కలెక్టరేట్ ఎదుట వీఆర్ఏల వారసుల ధర్నా



**ఇబ్రహీంపట్నం రూరల్:** గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో 81,85 ప్రకారం 61 ఏళ్లు పైబడిన వారి వారసులకు ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కోరుతూ గురువారం కలెక్టరేట్ ఎదుట బాధిత కుటుంబ సభ్యులు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో 169 మంది వీఆర్ఏలకు నేటికీ పోస్టింగ్ ఇవ్వలేదని అన్నారు. ఇప్పటికే 20 మంది వరకు ఉద్యోగం ఇవ్వలేదనే బెంగతో చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 3,797 మందికి ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉందన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న తమ కుటుంబాలకు ఉద్యోగ నియామక పత్రాలు అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆందోళన చేస్తున్న వారికి ఏఐటీయూసీ జిల్లా నాయకుడు పర్వతాలు ఆధ్వర్యంలో సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో 61 సంవత్సరాలు పైబడిన వారసుల సంఘం నాయకులు శ్రీనివాస్, లలిత, యాదయ్య, బాల్‌రాజ్, ప్రదీప్, వెంకటయ్య, కుమార్, యాదగిరి, రాములు, శ్రీనివాస్, హరిశంకర్ పాల్గొన్నారు.

### లీలా లక్ష్మారెడ్డికి భారత్ గౌరవ్ పురస్కార్



పురస్కారం అందుకుంటున్న లీలా లక్ష్మారెడ్డి

**ఆమనగల్లు:** కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ చైర్‌పర్సన్ లీలా లక్ష్మారెడ్డి భారత్ వికాస్ సంఘం ఆధ్వర్యంలో అందించే భారత్ గౌరవ్ పురస్కార్‌ను అందుకున్నారు. పచ్చదనాన్ని కాపాడుకోవడం, భవిష్యత్తు తరాలకు అందమైన ప్రకృతిని అందించాలనే సంకల్పంతో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ చైర్మన్ లీలా లక్ష్మారెడ్డి మొక్కలు నాటే కార్యక్రమాలు, పర్యావరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో భారత్ వికాస్ సంఘం అందించే భారత్ గౌరవ పురస్కార్‌కు ఆమె ఎంపికయ్యారు. కర్ణాటక రాష్ట్రం కలబుర్గి జిల్లా సేడం ప్రాంతంలో భారతీయ వికాస్ సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సంస్కృతి ఉత్సవ్‌లో పద్మశ్రీ అవార్డు గ్రహీత మంజమ్మజోగాతి చేతులమీదుగా ఆమె పురస్కారాన్ని అందుకున్నారు.

### నిబంధనలకు విరుద్ధమైన చికిత్సలు సహించేది లేదు



పోల్కంపల్లిలో క్లినిక్‌ను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్ఓ వెంకటేశ్వరావు

**ఇబ్రహీంపట్నం రూరల్:** నిబంధనలకు విరుద్ధంగా ఆర్ఎంపీ వైద్యులు చికిత్స చేస్తే సహించేది లేదని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లిలో ఓ ప్రైవేటు క్లినిక్‌లో స్థాయికి మించిన వైద్యం చేస్తున్నారనే సమాచారంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తనిఖీ చేపట్టారు. కాలం చెల్లిన మందులు, సిరంజిలు, స్టిచ్చింగ్ సామగ్రి, మరికొన్ని నిషేధిత మందులు స్వాధీనం చేసుకున్నారు. అర్హతలు లేకున్నా చిన్న పిల్లలకు, గర్భిణులకు చికిత్స చేస్తున్నారని గుర్తించారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపిన అనంతరం చర్యలు తీసుకుంటామని, తాత్కాలికంగా క్లినిక్‌ను సీజ్ చేసినట్లు జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, సరిత తదితరులు పాల్గొన్నారు.

### మెట్రో పచ్చదనానికి అవార్డుల పంట

**సాక్షి, సిటీబ్యూరో:** మెట్రో స్టేషన్‌లు, పరిసరాల్లో పచ్చదనం విస్తరణకు అవార్డుల పంట పండింది. ల్యాండ్‌స్కేప్ గార్డెనింగ్‌లో ఏకంగా 8 గోల్డ్ అవార్డులు లభించాయి. ఇటీవల ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో పబ్లిక్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉద్యాన శాఖ డైరెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అవార్డులను అందజేశారు. నగరంలోని మెట్రో స్టేషన్‌లు, ప్రాంగణాల్లో పచ్చదనాన్ని పెంపొందించి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటు చేసేందుకు తాము చేపట్టిన చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయని హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరేళ్లుగా మెట్రో పచ్చదనానికి అవార్డులు లభించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

# ఒత్తిడే శత్రువు!

## సమీపిస్తున్న టెన్త్, ఇంటర్ వార్షిక పరీక్షలు





మరికొద్ది రోజుల్లో టెన్త్, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షల సమయం సమీపిస్తున్నకొద్దీ.. విద్యార్థుల్లో ఆందోళన మరింత పెరుగుతోంది. పరీక్షల్లో తప్పుతామోనని.. కొంత మంది, తల్లిదండ్రులు ఆశించిన దానికంటే తమకు తక్కువ మార్కులు వస్తాయోననే టెన్షన్‌తో మరికొంత మంది తీవ్రమైన ఒత్తిడికి లోనవుతున్నారు. బలహీన క్షణంలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వార్షిక పరీక్షల వేళ.. విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా కౌన్సెలింగ్ ఇచ్చేందుకు ఏ ఒక్క రెసిడెన్షియల్ కాలేజీలోనూ కౌన్సిలర్ లేకపోవడం కూడా ఈ విపత్కర పరిణామాలకు మరో కారణం. అధ్యాపకులే కాదు తల్లిదండ్రులు కూడా విద్యార్థుల మానసిక స్థితిపై ఓ కన్నేసి ఉంచాలని నిపుణులు సూచిస్తున్నారు. బలవంతపు బోధన, అభ్యసన కంటే.. ఇష్టంతో చదివేలా విద్యార్థులను మానసికంగా సంసిద్ధులను చేసినప్పుడు మంచి ఫలితాలు వస్తాయని చెబుతున్నారు.

– సాక్షి, రంగారెడ్డి జిల్లా

**ఫెయిల్ అవుతామేమోనని విద్యార్థుల్లో భయం**

- క్షణికావేశంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్న వైనం
- కష్టంగా కాదు.. ఇష్టంగా చదివితేనే విజయం
- పరీక్షలకు మానసికంగా సిద్ధం చేయాలంటున్న నిపుణులు
- తల్లిదండ్రులు, టీచర్లు ఓ కన్నేసి ఉంచాలని సూచన

### ర్యాంకులు, గ్రేడ్లు రద్దు చేశాం



విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు ప్రభుత్వం ఇప్పటికే టెన్త్‌లో ర్యాంకులు, గ్రేడింగ్ విధానాన్ని రద్దు చేసింది. ప్రభుత్వ స్కూళ్లలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారిలో మానసిక స్థైర్యాన్ని నింపి, మానసికంగా పరీక్షలకు సంసిద్ధులను చేస్తున్నాం. అర్థం కాని పాఠ్యాంశాలను మళ్లీ వివరించే ప్రయత్నం చేస్తున్నాం. వార్షిక పరీక్షలపై వారిలో ఉన్న భయాన్ని పూర్తిగా పోగొట్టే ప్రయత్నం చేస్తున్నాం. మోడల్ పేపర్లను తయారు చేసి, పరీక్షలు రాయిస్తున్నాం.

– సుశీందర్‌రావు, జిల్లా విద్యాధికారి

### ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



అత్యధిక మార్కులు సాధించాలనే ఉద్దేశంతో చాలా మంది పిల్లలు నిద్రాహారాలు మాని చదువుతుంటారు. అదేపనిగా చదవడంతో తలనొప్పి, మానసిక సంఘర్షణ, కంటిచూపు సమస్య తలెత్తుంది. తీరా పరీక్షలు మొదలయ్యే నాటికి అనారోగ్యం పాల వుతుంటారు. పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపించాలి. వేళకు నిద్రపుచ్చడం, వేళకు నిద్రలేపి ఓ ప్రణాళిక ప్రకారం చదివించడం చేయాలి. తేలికగా జీర్ణం అయ్యే, అప్పుడే వండివార్చిన తాజా ఆహారం అందించాలి. శక్తినిచ్చే డ్రైఫ్రూట్స్, తాజా పండ్లు ఆహారంగా ఇవ్వాలి.

– డాక్టర్ వెంకటి, డీఎంహెచ్ఓ, హైదరాబాద్


### ప్రేమతో చెప్పాలి



పిల్లల ఆత్మహత్యలకు కాలేజీ యాజమాన్యాలది ఎంత బాధ్యత ఉంటుందో? తల్లిదండ్రులదీ అంతే బాధ్యత ఉంటుంది. పిల్లల మానసిక స్థితిని అర్థం చేసుకోకుండా వారికి ఇష్టం లేని కోర్సులు, కాలేజీల్లో బలవంతంగా చేర్పిస్తుంటారు. ఈ సమయంలో కనీసం కౌన్సెలింగ్ కూడా ఇవ్వడం లేదు. ఒత్తిడికి గురై, ఆత్మహత్యలకు పూనుకుంటున్నారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్నకొద్దీ.. వారిలో ఆందోళన, భయం ఎక్కువై.. ఆత్మహత్యలకు పూనుకుంటున్నారు. ఇలాంటి సమయంలో తల్లిదండ్రులు వారితో ప్రేమగా వ్యవహరించాలి. మానసిక స్థైర్యం చెప్పాలే గానీ.. వారిని తోటి పిల్లలు, బంధువుల ముందు తిట్టకూడదు.

– డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, మానసిక నిపుణుడు

### మచ్చుకు కొన్ని ఇటీవలి ఉదంతాలు



- ప్రిన్సిపాల్ తిట్టాడనే కారణంతో షాద్‌నగర్‌లోని శాస్త్ర పాఠశాల భవనంపై నుంచి దూకి 10వ తరగతి విద్యార్థి నీరజ్ బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
- పరీక్షలో ఫెయిల్ అవుతాననే భయంతో మైసమ్మగూడ మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న ఓ విద్యార్థిని కళాశాల నాలుగో అంతస్తు కిటికీ నుంచి కిందికి దూకి ఆత్మహత్యకు యత్నించగా, తోటి విద్యార్థులు గమనించి, అడ్డుకున్నారు.
- కుంట్లూరులోని తెలంగాణ గిరిజన రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న నాగర్‌కర్నూలుకు చెందిన సౌమ్య (17) ఇటీవల తరగతి గదిలో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.
- చదువు ఒత్తిడి తట్టుకోలేక హైదర్‌నగర్ శ్రీ చైతన్య జూనియర్ కాలేజీలో ఇంటర్ చదువుతున్న షాద్‌నగర్‌కు చెందిన విద్యార్థి కౌశిక్ రాఘవ (17) హాస్టల్ గదిలో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
- పరీక్ష సరిగా రాయలేదనే కారణంతో జీడిమెట్ల పీఎస్ పరిధిలో ఇటీవల పదో తరగతి విద్యార్థిని త్రిష ఆత్మహత్యకు పాల్పడింది.

## స్కూల్ వ్యాన్ చక్రాల కింద నలిగిన చిన్నారి

**నాలుగేళ్ల బాలికను బలిగొన్న డ్రైవర్ నిర్లక్ష్యం**



రిత్విక (ఫైల్)

**హయత్‌నగర్:** ప్రతిరోజూ తనను పాఠశాల నుంచి తీసుకొచ్చే వాహనమే ఆ చిన్నారి పాలిట మృత్యు శకటంగా మారింది. పాఠశాల నుంచి వచ్చి ఇంటి వద్ద దిగి వెళ్తుండగా డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా బాలిక వ్యాన్ టైరు కిందపడి మృతి చెందిన ఘటన గురువారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దఅంబర్‌పేట్ హనుమాన్ హిల్స్‌లో నివసించే నర్సింహ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఆయనకు ముగ్గురు కూతుళ్లు. రెండో కుమార్తె రిత్విక (4) హయత్‌నగర్‌లోని శ్రీ చైతన్య పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతోంది. గురువారం ఉదయం పాఠశాలకు వెళ్లిన రిత్విక సాయంత్రం స్కూల్ వ్యాన్‌లో వచ్చి ఇంటి సమీపంలో దిగింది. డ్రైవర్ గణేశ్ నిర్లక్ష్యంగా వ్యాన్‌ను వెనక్కి తీయడంతో రిత్విక వాహనం ముందు చక్రాల కిందపడి నలిగిపోయింది. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. కాగా.. సంబంధిత వ్యాన్‌కు ఎలాంటి పర్మిషన్ లేదని పోలీసులు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న వారు మృత దేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**పాఠశాల ఎదుట ఆందోళన**

విషయం తెలుసుకున్న మృతురాలి బంధువులు, గ్రామస్తులు, విద్యార్థి సంఘాల నాయకులు శ్రీ చైతన్య పాఠశాల వద్దకు చేరుకున్నారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలంటూ పాఠశాల గేటు ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగారు. విజయవాడ రహదారిపై కొద్దిసేపు వాహ నాల రాకపోకలు నిలిచిపోయాయి. పోలీ సులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. రాత్రి 9 గంటల వరకూ పాఠశాల యాజమాన్యం అందుబాటులోకి రాలేదు.

# చనిపోయినా 'కంటి వెలుగై'

- నీరజ్ నేత్రాలు దానం చేసిన కుటుంబసభ్యులు
- అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు పూర్తి



నీరజ్‌తో తండ్రి హరిభూషణ్ (ఫైల్)

**షాద్‌నగర్:** కొడుకు విగత జీవిగా మారినా అతని నేత్రాలు సజీవంగా ఉండాలన్న ఆశయంతో నేత్ర దానం చేసి తమ ఔదార్యాన్ని చాటారు ఆ తల్లిదండ్రులు. షాద్‌నగర్‌లోని సీఎస్‌కే వెంచర్‌లో నివసించే కోరమోని హరిభూషణ్, భాగ్య దంపతుల కుమారుడు నీరజ్ (15) బుధవారం పాఠశాల ప్రిన్సిపాల్ మందలించాడని భవనం పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. కన్న కొడుకు మరణించి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ తల్లిదండ్రులు సమాజానికి ఉపయోగపడాలనే ఆలోచనతో నీరజ్ రెండు కళ్లను ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి దానం చేసి ఆదర్శంగా నిలిచారు. కళ్లను దానం చేసినందుకు ఆస్పత్రి వారు ధ్రువపత్రాన్ని జారీ చేశారు. కాగా, ఉస్మానియా ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం నీరజ్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఫరూఖ్‌నగర్‌లోని నాగులపల్లి రోడ్డులో ఉన్న శ్మశానవాటికలో అశ్రునయనాల మధ్య నీరజ్ అంత్యక్రియలు పూర్తి చేశారు.

**పాఠశాల గుర్తింపును రద్దు చేయాలి**

**షాద్‌నగర్‌రూరల్:** విద్యార్థి నీరజ్ ఆత్మహత్యకు కారణమైన శాస్త్ర పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నీరజ్ ఆత్మహత్య ఘటనను నిరసిస్తూ గురువారం పట్టణంలోని శాస్త్ర పాఠశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీ విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. పాఠశాలలోకి వెళ్లే క్రమంలో విద్యార్థి సంఘం నాయకులు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పట్టణ సీఐ విజయ్‌కుమార్ ఘటనాస్థలానికి చేరుకొని ఆందోళనకారులను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. నీరజ్ మృతిపై సమగ్రవిచారణ చేపట్టాలని, విద్యార్థి చావుకు కారణమైన పాఠశాలపై చర్యలు తీసుకొని మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పవన్‌చౌహాన్, ఉపాధ్యక్షుడు శివకుమార్, సహాయ కార్యదర్శి ఆకాష్‌సాయి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ జిల్లా కన్వీనర్ సూర్యప్రకాష్, జిల్లా కన్వీనర్ చందు, రాష్ట్ర కో కన్వీనర్ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## తండాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

**షాద్‌నగర్:** గిరిజన తండాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీను నాయక్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తండాలను అభివృద్ధి చేయడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విమర్శించారు. పంచాయతీలకు రెవెన్యూ సమకూర్చకపోవడంతో తండాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ హయాంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ తీసుకు వస్తే నిధులను గత పాలకులు పక్కదారి పట్టించారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తండాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతోందని చెప్పారు. సమావేశంలో నాయకులు రూప్లా నాయక్, నెహ్రూ నాయక్, శ్రీనివాస్ నాయక్, కొర్ర రవినాయక్, రమేష్ నాయక్, మేఘ్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ధర్మ సంసత్‌లో చిలుకూరు అర్చకుడు



రంగరాజన్‌కు జ్ఞాపికను అందజేస్తున్న అవిముక్తేశ్వరానంద సరస్వతి స్వామీజీ

**మొయినాబాద్:** మహా కుంభమేళా ధర్మ సంసత్‌లో చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్ పాల్గొన్నారు. కుంభమేళాలో పవిత్రస్నానం ఆచరించిన ఆయన గురువారం ఉత్తరాణ్మాయ జ్యోతిష్పీఠం శంకర మఠానికి చెందిన అవిముక్తేశ్వరానంద సరస్వతి స్వామీజీ నిర్వహించిన ధర్మ సంసత్‌లో చిలుకూరు ప్రతినిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిలుకూరు బాలాజీ దేవాలయం ధర్మ పరిరక్షణకోసం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. రామరాజ్య స్థాపన కోసం చిలుకూరు నుంచి జరుగుతున్న ఉద్యమాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా అవిముక్తేశ్వరానంద సరస్వతి స్వామీజీ అర్చకుడు రంగరాజన్‌కు జ్ఞాపికను అందజేశారు.

## చిప్స్ తింటూ చిన్నారి మృతి

- శ్వాసనాళంలో ఇరుక్కోవడంతో రెండేళ్ల పాప దుర్మరణం
- వలస కుటుంబంలో తీరని విషాదం



చిన్నారి మృతదేహాన్ని ఎత్తుకుని రోదిస్తున్న తల్లిదండ్రులు

**మొయినాబాద్:** చిప్స్ తింటుండగా శ్వాసనాళంలో ఇరుక్కుని రెండేళ్ల చిన్నారి మృతిచెందిన ఘటన మొయినాబాద్‌లో చోటుచేసుకుంది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రజ్వీర్, రోసళి దంపతులు తమ రెండేళ్ల కూతురుతో కలిసి ఆరు నెలల క్రితం మొయినాబాద్‌కు వలస వచ్చారు. తోల్‌కట్ట సమీపంలోని ఓ ఫాంహౌస్‌లో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇదిలా ఉండగా గురువారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో భార్యాభర్తలు భోజనం చేస్తూ చిన్నారికి చిప్స్ ప్యాకెట్ ఇచ్చారు. ఇది తింటూ పాప ఒక్కసారిగా కింద పడిపోయింది. వెంటనే తట్టిలేపే ప్రయత్నం చేయగా, అప్పటికే అపస్మారక స్థితికి చేరుకుంది. హుటాహుటిన స్థానిక భాస్కర ఆస్పత్రికి తీసుకెళ్లగా, పరీక్షించిన వైద్యులు పాప మృతిచెందినట్లు నిర్ధారించారు. చిన్నారికి ఏం తినిపించారని డాక్టర్లు అడగగా.. చిప్స్ ఇచ్చామని చెప్పారు. చిప్స్ తింటుండగా అది శ్వాస నాళంలో చిక్కుకుని మృతిచెందిందని వైద్యులు తెలిపారు. చిన్న పిల్లలకు ఇలాంటి ఆహార పదార్థాలు తినిపించవద్దని సూచించారు. బతుకు దెరువుకోసం వచ్చిన వలస కుటుంబంలో పాప మృతి తీరని విషాదం నింపింది. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.



వరిధాన్యం సేకరణ

# ఎదురుచూపులు

- అక్టోబర్‌లో కొనుగోలు చేసిన వరిధాన్యం
- 1,971 మంది రైతుల నుంచి 9,936 మెట్రిక్ టన్నులు సేకరణ
- 1,120 మంది నుంచి 5,607 క్వింటాళ్ల సన్నాలు..
- బోనస్ రూ.2.88 కోట్లకు గాను రూ.1.33 కోట్లు చెల్లింపు
- మిగతా మొత్తం కోసం అన్నదాతల నిరీక్షణ

**ఇబ్రహీంపట్నం రూరల్:** ఆరుగాలం పండించిన పంటలకు ప్రభుత్వం మద్దతు ధరతో పాటు రైతులను ప్రోత్సహించేందుకు బోనస్ చెల్లిస్తామని ప్రకటించింది. ఖరీఫ్ సీజనల్‌లో పండించిన ధాన్యం సేకరణకు జిల్లా వ్యాప్తంగా 44 కేంద్రాలను ఏర్పాటు చేసింది. 38 కేంద్రాల నుంచి దొడ్డు, సన్నరకం ధాన్యాన్ని సేకరించారు. ఆయా కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 9,936 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. 1,971 మంది రైతుల నుంచి 5,607 మెట్రిక్ టన్నుల సన్నాలు, 4,331 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం సేకరించారు. దీనికి గాను రూ.23.05 కోట్లు రైతులకు చెల్లించాలి. దశల వారీగా వారికి మద్దతు ధర చెల్లించారు.

**రైతులకు అందింది సగమే..**

క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో రైతులంతా సన్న వడ్లు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకే విక్రయించారు. జిల్లాలో సన్న వడ్లు పండించిన 1,120 మంది రైతులు నుంచి 5,607 మెట్రిక్ టన్నులు సేకరించారు. సేకరించిన ధాన్యాన్ని మిల్లర్లకు అప్పగించారు. సన్నరకం ధాన్యం పండించిన రైతులకు బోనస్‌గా రూ.2.88 కోట్లు చెల్లించాలి. ఇప్పటివరకు రూ.1.33 కోట్లు మాత్రమే చెల్లించారు. మిగతా మొత్తం రావాల్సి ఉంది. అక్టోబర్ నుంచి జనవరి వరకు ధాన్యం సేకరించిన అధికారులు నేటికీ డబ్బులు చెల్లించలేదు. బోనస్ కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. అప్పులు చేసి పంటలు పండించామని ఇస్తామన్న బోనస్ ఇస్తే వాటిని తీర్చేస్తామని చెబుతున్నారు.

### రూ.1.86 లక్షలు రావాలి



ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో 370 క్వింటాళ్ల ధాన్యం విక్రయించా. మొత్తం రూ.1.86 లక్షల బోనస్ రావాల్సి ఉంది. పీఏసీఎస్‌లో అడిగితే మాకు సంబంధం లేదని, డీఎస్‌ఓను అడగమంటున్నారు. డీఎస్‌ఓను అడిగితే పొంతన లేని సమాధానం చెబుతున్నారు. కొంత మందికి ఇచ్చారు. మాకు ఇంకా రావడం లేదు.

– చెన్నకిషన్‌రెడ్డి, రైతు, ఎల్మినేడు

### దశలవారీగా జమ చేస్తున్నాం

రైతులకు దశల వారీగా డబ్బులు ఖాతాల్లో జమ చేస్తున్నాం. ఇప్పటికే పూర్తి స్థాయిలో బిల్లులు చేశాం. రెండు రోజులుగా ఎవ్వరికీ పెండింగ్ లేకుండా చేస్తున్నాం. ఎవరికైనా రాకపోతే నేరుగా కలవొచ్చు. ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌లు సక్రమంగా లేకుంటే జమ కావడం లేదు. అలాంటివారు మా దృష్టికి తీసుకొస్తే సమస్యను పరిష్కరిస్తాం.

– గంప శ్రీనివాస్, డీఎస్ఓ

# మహా సభలను విజయవంతం చేద్దాం


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రామస్వామి

**ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి**

మొయినాబాద్‌రూరల్: జిల్లా మహాసభలను విజయవంతం చేసుకునేందుకు సమష్టిగా కృషి చేద్దామని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ చౌరస్తాలో గల లేబర్ అడ్డా పరిధిలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి, మండల ఇన్‌చార్జి వడ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో మహా సభలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 16వ తేదీన జరిగే భవన నిర్మాణ రంగం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు రాజు, కార్మికులు పాల్గొన్నారు.

**బహిరంగ ప్రకటన**

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకం నకు తెలియచేయునది ఏమనగా నా క్లయింట్ శ్రీ దామకూర పాపిరెడ్డి గారు బాచుపల్లి గ్రామం, కందుకూరు మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణా వద్ద నున్న మొత్తం ఎకరాలు 3.24 గుంటలు విస్తీర్ణం కలిగిన వ్యవసాయ భూమిని సర్వే నెంబర్లు 14/E/A/1 నందలి భాగం ఎకరాలు 0.18 గుంటలు విస్తీర్ణం భూమి శ్రీ పగడాల ఏ చాకలి రంగయ్య నుండి, సర్వే నెంబర్లు 14/E/1/1/1/2 నందలి భాగం ఎకరాలు 1.02 గుంటలు విస్తీర్ణం భూమి శ్రీమతి అప్రోజీ వనజ కుమారి నుండి, సర్వే నెంబర్లు 14/E/1 నందలి భాగం ఎకరాలు 1.02 గుంటలు విస్తీర్ణం భూమి శ్రీమతి బొజ్జపల్లి శ్రీలత నుండి మరియు సర్వే నెంబర్లు 14/E/1/2 నందలి భాగం ఎకరాలు 1.02 గుంటలు విస్తీర్ణం భూమి శ్రీమతి బండి మాధవి గార్ల నుండి కొనుగోలు చేయదలచినారు. సదరు ఆస్తుల సరిహద్దులు: ఉత్తరం- రోడ్డు మరియు ఇతరుల భూమి, దక్షిణం - రోడ్డు, తూర్పు ఇతరుల భూమి, పడమర-రోడ్డు, సదరు ఆస్తులకు తహశీల్దారు మరియు జాయింట్ సబ్-రిజిస్ట్రార్, కందుకూరు మండలం, రంగారెడ్డి జిల్లా, తెలంగాణా నందు రిజిస్టర్ చేయబడిన గిఫ్ట్ దస్తావేజులు నెంబర్లు 1548/19, 15460/19, 15459/19 ద్వారా వారు యజమానులై ఉన్నారు.

నా క్లయింట్ కొనుగోలు చేయదలచిన సదరు ఆస్తులకు సంబంధించి ఎవరికైనను ఏదైనా హక్కు, అధికారం, ఆసక్తి, క్లెయిమ్స్, సకున్యలు లేదా వివాదములు లేదా ఏదైన అభ్యంతరములు ఉన్నచో అందుకు సంబంధించిన తగిన రుజువులతో ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుండి ఒక వారం దినములు లోగా క్రింది సంతకందారుని కలవవచ్చును/సంప్రదించవచ్చును మరియు అటుతర్వాత అందిన క్లెయిమ్స్ లేదా అభ్యంతరములు పరిశీలించబడవు.

వంశీ కృష్ణ.టి. కన్సల్టెంట్-లీగల్
ప్లాట్ నెం. 103, E -బ్లాకు, రాంకీ పన్ మూర్తేల్ అపార్ట్మెంట్స్, గాజులరామారం
మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, తెలంగాణ - 500055, ఫోన్: 99495 22469
తేది: 05.02.2025

## తాళం వేసిన ఇంట్లో చోరీ

ఇబ్రహీంపట్నం రూరల్: పుట్టింటికి వెళ్లొచ్చే సరికి ఇంటి తాళం పగలగొట్టి బంగారు ఆభరణాలు, నగదు దొంగిలించారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. బాలాపూర్ మండలం నాదర్‌గుల్‌కు చెందిన గ్రీన్ హోమ్స్ కాలనీలో నివాసం ఉండే హలీమా గత నెల 31వ తేదీన అత్తాపూర్‌కు తన పుట్టింటికి వెళ్లింది. తిరిగి గురువారం ఉదయం నాదర్‌గుల్‌కు వచ్చింది. ఇంటి తాళం తీయడానికి చూడగా మెయిన్‌డోర్ విరగగొట్టి ఉంది. లోపలికి వెళ్లగా కబోర్డులో ఉన్న 5 తులాల బంగారం, 15 గ్రాముల వెండి ఆభరణాలు, కొంత నగదు దొంగిలించినట్లు గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి దొంగతనానికి పాల్పడినట్లు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## గంజాయి విక్రేత అరెస్టు

షాద్‌నగర్‌రూరల్: బిహార్ నుంచి గంజాయిని తీసుకువచ్చి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.ఈ సంఘటన పట్టణంలోని హాజిపల్లి రోడ్డులో గురువారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రం పహడిపూర్ గ్రామానికి చెందిన శిబుఆలం మండల పరిధిలోని బూర్గుల శివారులో పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. శిబుఆలం బిహార్ నుంచి రైలులో గంజాయిని తీసుకువచ్చి ఇక్కడ ప్యాకెట్లుగా మార్చి విక్రయిస్తుంటాడు. బూర్గుల శివారులో వలస కార్మికులకు గంజాయిని అమ్ముతుంటాడు. ఈ క్రమంలో పట్టణంలోని హాజిపల్లి రోడ్డులో శంషాబాద్ ఎస్‌ఓటీ, స్థానిక పోలీసులు శిబుఆలంను పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 268 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించించారు. కేసు నమోదు చేసిన దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ బలరాం తెలిపారు.

## అనారోగ్యంతో వంట మనిషి ఆత్మహత్య


జంగయ్య (ఫైల్)

కేశంపేట: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మంగళి జంగయ్య(45) ప్రభుత్వ బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో వంట మనిషిగా విధులు నిర్వహిస్తున్నారు. కొంత కాలంగా ఆయన కాలేయ సంబంధిత సమస్యతో బాధ పడుతున్నారు. ఇటీవల విధుల నుంచి ఇంటికి వచ్చిన ఆయన కుటుంబ సభ్యులతో అదే విషయమై విచారం వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కాసేపటికి కుటుంబ సభ్యులు ఇంటికొచ్చి స్థానికుల సహాయంతో తలుపులు తీసి చూడగా అప్పటికే జంగయ్య విగత జీవిగా పడి ఉన్నారు. మృతదేహాన్ని షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గురువారం ఉదయం మృతుడి కుమారుడు శ్రీనాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరహరి తెలిపారు.

## ప్రైవేట్ స్కూల్ ప్రిన్సిపల్‌పై పోక్సో కేసు

ఇబ్రహీంపట్నం: విద్యాబుద్ధులు నేర్పించాల్సిన గురువే ఓ విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకున్న ఈ సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నంలోని లయోలా స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న బాలికపై ప్రిన్సిపల్ దినావస్‌రావు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని సదరు విద్యార్థి తల్లికి చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పాక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకుని, విచారణ చేస్తున్నట్లు ఏసీపీ కేపీవీ రాజు తెలిపారు.

# ఇంట్లోకి చొరబడి.. కత్తులతో పొడిచి

- తల్లీకుమారుడిపై హత్యాయత్నం
- తీవ్రగాయాలతో గాంధీలో చికిత్స
- కుమారుడు యశ్వంత్ పరిస్థితి విషమం
- అపస్మారకస్థితిలో తల్లి రేణుక
- దర్యాప్తు చేపట్టిన పోలీసులు


రేణుక, యశ్వంత్ (ఫైల్)


ఘటన జరిగిన ఇల్లు ఇదే

చిలకలగూడ: ఓ ఇంట్లోకి చొరబడిన గుర్తుతెలియని వ్యక్తులు తల్లి కొడుకుపై కత్తులతో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం చిలకలగూడ ఠాణా పరిధిలోని మెట్టుగూడలో చోటుచేసుకుంది. తల్లి అపస్మారకస్థితిలో ఉండగా, కుమారుడి పరిస్థితి విషమంగా ఉంది. ఎవరు, ఎందుకు దాడికి పాల్పడ్డారో తెలియరాలేదు. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మెట్టుగూడ నల్లపోచమ్మ ఆలయ సమీపంలో రేణుక, శేఖర్ దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ముగ్గురు కుమారులు యశ్వంత్, యశ్పాల్, వినయ్ ఉన్నారు. ఏజీ కార్యాలయంలో పనిచేసే శేఖర్ మూడేళ్ల క్రితం మృతిచెందాడు. రేణుక, తన ముగ్గురు కుమారులు, మంచానికే పరిమితమైన అత్త (శేఖర్ తల్లి) అనసూయ (70) కలిసి ఉంటున్నారు. మౌలాలీలోని ఓ రైల్వే కాంట్రాక్టర్ వద్ద పనిచేస్తున్న యశ్వంత్ గత మూడు నెలలుగా పనికి వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. యశ్పాల్, వినయ్ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. గురువారం ఉదయం యశ్పాల్, వినయ్ డ్యూటీకి వెళ్లగా యశ్వంత్, తల్లి రేణుక ఇంట్లోనే ఉన్నారు. ఉదయం 11.30 గంటల సమయంలో ఇంట్లోకి చొరబడిన గుర్తుతెలియని వ్యక్తులు రేణుక, యశ్వంత్‌లపై కత్తులతో విచక్షణా రహితంగా దాడి చేసిన అనంతరం బయట తలుపులకు గడియ పెట్టి వెళ్లిపోయారు. తీవ్రంగా గాయపడిన వారి కేకలు విన్న స్థానికులు తలుపులు తెరిచి చూడగా ఇద్దరూ రక్తపు మడుగులో ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. దీంతో వారిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు. రేణుక కడుపుపై రెండు, యశ్వంత్ కడుపుపై మూడు కత్తిపోట్లు ఉన్నాయి. రేణుక అపస్మారకస్థితిలో ఉండగా, యశ్వంత్ పరిస్థితి విషమంగా ఉందని, వారికి ఆపరేషన్ చేయాల్సిన అవసరం ఉందని వైద్యులు తెలిపారు.

**పథకం ప్రకారమే దాడి..**

తాము ఇంట్లో లేని సమయం చూసి పథకం ప్రకారమే దుండగులు హత్యాయత్నానికి పాల్పడ్డారని రేణుక మూడో కుమారుడు వినయ్ తెలిపాడు. తమకు ఎవరితోనూ శత్రుత్వం లేదన్నాడు. ఎవరు ఎందుకు దాడి చేశారో తెలియడం లేదని, ఆరుగురు వ్యక్తులు దాడిలో పాల్గొన్నారని, నలుగురు ఇంట్లోకి చొరబడి దాడి చేయగా, ఇద్దరు బయటే ఉన్నట్లు తెలిపాడు.

**సవాల్‌గా తీసుకున్న పోలీసులు...**

హత్యాయత్నంపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ నర్సయ్య, చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి, చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్, డీఐ రమేష్‌గౌడ్‌లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్ ఆధారాలు సేకరించారు. రక్తపు మరకలతో ఉన్న పదునైన ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఈ ఘటనలో దుండగులను ప్రత్యక్షంగా చూసిన వారు లేక పోవడం గమనార్హం.

**బాధితులు నోరు విప్పితేనే...**

గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు కోలుకుని నోరువిప్పితేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ నర్సయ్య, చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి తెలిపారు. దుండగులను కేవలం బాధితులు మాత్రమే చూశారన్నారు. అన్ని కోణాల్లోను దర్యాప్తు చేపట్టామని, త్వరలోనే మిస్టరీని ఛేదిస్తామన్నారు.

# ఏఎన్ఎంల డిమాండ్లు పరిష్కరించాలి

**ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్వతాలు**


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఎన్ఎంలు, ఏఐటీయూసీ నేతలు

షాద్‌నగర్: రెండవ ఏఎన్ఎంల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం షాద్‌నగర్ నుంచి రెండవ ఏఎన్ఎంలు, ఏఐటీయూసీ నాయకులతో కలిసి జిల్లా కార్యాలయంలో కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పర్వతాలు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రెండవ ఏఎన్ఎంలను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చి నెరవేర్చ లేదన్నారు. ఎన్నో ఏళ్లుగా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఎన్ఎంలు పోరాటం చేస్తున్న పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను గ్రామస్థాయిలో విజయవంతంగా అమలు చేయడంలో ఏఎన్ఎంలు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ఏళ్లుగా ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూ.. సలహాలు, సూచనలు అందజేస్తున్నారన్నారు. అలాంటి వారి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్ఎంల సంఘం నాయకులు పద్మ, జయమ్మ, ఏఐటీయూసీ నాయకులు సామిడి శేఖర్, చంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# తొమ్మిది నెలలుగా జీతాలు లేవు

**చిల్డ్రన్ హోమ్ ఎదుట సిబ్బంది నిరసన**


చిల్డ్రన్ హోమ్ ఎదుట ఆందోళన చేస్తున్న సిబ్బంది

తుర్కయంజాల్: తొమ్మిది నెలలుగా తమకు జీతాలు చెల్లించడంలేదని పురపాలక సంఘం పరిధి కమ్మగూడలోని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చిల్డ్రన్ హోమ్ సిబ్బంది గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గడిచిన 9 నెలలుగా జీతాలు రావడం లేదని, పూట గడవడమే కష్టంగా మారిందని వాపోయారు. వేతనాలు ఇవ్వడం లేదని ప్రశ్నిస్తే మిమ్మల్ని ఉద్యోగులుగా ఎవరు నియమించుకున్నారని, మీ నియామకాలు చెల్లవని హెచ్చరిస్తున్నారన్నారు. ఈ విషయంపై జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి సంధ్యారాణిని వివరణ కోరగా.. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే సిబ్బందికి జీతాలు అందిస్తామని తెలిపారు. చిల్డ్రన్ హోమ్‌లో పనిచేసే సిబ్బందికి రోజువారి వేతనాలను చెల్లిస్తున్నామని, త్వరలోనే ఔట్ సోర్సింగ్ ద్వారా సిబ్బందిని నియమిస్తామని వివరించారు.

# సంగెంలో వెంచర్ల రికార్డులు సీజ్


సంగెం గ్రామ పంచాయతీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ మల్లారెడ్డి

కేశంపేట: మండల పరిధిలోని సంగెం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని షాద్‌నగర్ డీఎల్‌పీఓ మల్లారెడ్డి, ఎంపీఓ కిష్టయ్య గురువారం సందర్శించారు. ఆఫీసులోని రికార్డులను పరిశీలించారు. గ్రామంలోని లేఅవుట్లలో అవకతవకలు జరుగుతున్నాయని గుర్తించి, ఇందుకు సంబంధించిన రికార్డులను సీజ్ చేశారు. అక్రమంగా వెలిసిన లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ సెక్రటరీ సందీప్‌కు సూచించారు. సీజ్ చేసిన రికార్డులను జిల్లా పంచాయతీ కార్యాలయంలో సమర్పించనున్నట్లు ఎంపీఓ తెలిపారు. లేఅవుట్లలో అక్రమలు జరిగినట్లు తేలితే చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

# గాయపడిన నెమలికి చికిత్స


ఆస్పత్రిలో నెమలిని పరిశీలిస్తున్న డాక్టర్, చిత్రంలో ఫారెస్ట్ అధికారి

కేశంపేట: తీవ్ర గాయాలై నడవలేని స్థితిలో ఉన్న నెమలిని మండల పరిధిలోని లింగంధన గ్రామానికి చెందిన శేఖర్‌గౌడ్ వ్యవసాయం పొలంలో గురువారం స్థానికులు గుర్తించారు. ఈ విషయాన్ని సింగిల్ విండో డైరెక్టర్ మధుసూదన్‌గౌడ్ ఆమనగల్లు ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. ఫారెస్టు సెక్షన్ అధికారి అన్వర్ హుస్సేన్‌ఖాన్ సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకొని గాయపడిన నెమలిని పరిశీలించారు. కాలికి గాయం కావడంతో నడవలేని స్థితిలో ఉందని ఫారెస్టు అధికారి తెలిపారు. దీంతో తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల ప్రభుత్వ వెటర్నరీ ఆసుపత్రికి నెమలిని ఫారెస్టు అధికారి తీసుకెళ్లారు. అక్కడ పశువైద్యుడు విజయ్‌కుమార్ పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నారు. నెమలి కోలుకున్న తర్వాత అడవిలో వదిలి పెట్టనున్నట్లు ఫారెస్టు అధికారి తెలిపారు.

# ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి మృతి

యాచారం: ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా కొండ మల్లేపల్లికి చెందిన సతీష్(22) గురువారం ఉదయం నగరం నుంచి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నాడు. నాగార్జునసాగర్- హైదరాబాద్ రహదారిపై, యాచారం సమీపంలో దేవరకొండ డిపోకు చెందిన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సతీష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అతన్ని 108 అంబులెన్స్‌లో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సతీష్ మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహారావు తెలిపారు.

# చింతల్‌మెట్‌లో వాహనాల తనిఖీ

అత్తాపూర్: డ్రైవింగ్ లైసెన్సులు లేని వారు, మైనర్లు, ట్రిబుల్ రైడింగ్ చేసే వారిపట్ల కఠిన చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.రాజేందర్‌గౌడ్ హెచ్చరించారు. చింతల్‌మెట్ చౌరస్తాలో గురువారం సాయంత్రం సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మైనర్‌ల తల్లిదండ్రులకు ఇన్‌స్పెక్టర్ కౌన్సిలింగ్ ఇచ్చారు. మైనర్లకు కుటుంబ సభ్యులు ఎలాంటి పరిస్థితుల్లో వాహనాలు ఇవ్వరాదని స్పష్టం చేశారు. వాహన కెపాసిటీ ఆధారంగా మాత్రమే ఆ వాహనాలపై ప్రయాణించాల్సి ఉంటుందన్నారు. కచ్చితంగా హెల్మెట్‌ను ధరించాలన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. 15 ద్విచక్ర వాహనాలను సీజ్ చేయడంతో పాటు పెనాల్టీలను విధించారు.

# సంపూర్ణ ఆరోగ్యంతోనే సత్ఫలితాలు

**ఎన్ఐఆర్డీ ప్రొఫెసర్ వాణిశ్రీ**


చిన్నారి బరువు కొలుస్తున్న ఫార్మసీ విద్యార్థినులు

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉన్నప్పుడే సత్ఫలితాలు సాధిస్తారని ఎన్ఐఆర్డీ (జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ) ప్రొఫెసర్ వాణిశ్రీ అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బూర్గులలో ప్రగతి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పోషకాహార లోపంపై మూన్‌రే ఫార్మసీ కళాశాల విద్యార్థినులకు అవగాహన కల్పించారు. నేరళ్ల చెరువు, నల్లమెతల తండా, కుందేలుకుంటతండా, చింతగూడ, కడియాలకుంటతండా, తిమ్మాజిపల్లి, పోతురాజుగడ్డతండా, బూరుగడ్డ తండాలలోని అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహార లోపం నిర్ధారించే ఎత్తు, బరువు కొలతలను చేపట్టారు. పోషకాహారం లోపం ఉన్న విద్యార్థులను గుర్తించి వైద్యులను సంప్రదించాలని సూచించారు. అనంతరం ప్రొఫెసర్ వాణిశ్రీ మాట్లాడుతూ.. పోషకాహార లోపం విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. చిన్నారుల్లో ఎదుగుదల, మానసిక పరిస్థితి సక్రమంగా ఉందన్నారు. దీంతో ఏకాగ్రత క్షీణిస్తుందన్నారు. విద్య లేకపోతే భవిష్యత్‌లో ఉపాధి మార్గాలు లభించవని, దీంతో ఆ కుటుంబం పేదరికంలోనే ఉండాల్సిన పరిస్థితులు నెలకొంటాయని అన్నారు. కార్యక్రమంలో మూన్‌రే ఫార్మసీ కళాశాల అధ్యాపకురాలు శ్రీలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సంధ్య, ప్రగతి వెల్ఫేర్ సొసైటీ సీనియర్ ఎడ్యుకేషన్ మేనేజర్ మురళి, మాల్ న్యూట్రీషియన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ శంకర్, ప్రగతి సిబ్బంది లావణ్య, తులసి, శ్వేత, ప్రగతి, శృతి, శ్రీకాంత్, జగదీష్, కార్తీక్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# భారత సంస్కృతి ప్రపంచానికే గర్వకారణం

- అనుచరులను ప్రోత్సహించడమే నాయకుల లక్షణం
- ఐఐఎం, కొజికోడ్ డైరెక్టర్ దెబాషిశ్ ఛటర్జీ


ఐఐఎం, కొజికోడ్ డైరెక్టర్ ఛటర్జీతో ఇక్ఫాయ్ కళాశాల బృందం

శంకర్‌పల్లి: భారతదేశ సంస్కృతి ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోందని ఐఐఎం (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్), కొజికోడ్ డైరెక్టర్ దెబాషిశ్ ఛటర్జీ అన్నారు. దొంతన్‌పల్లిలోని ఇక్ఫాయ్ డీమ్డ్ యూనివర్సిటీ 15వ వ్యవస్థాపక దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరవగా ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రంగరాజన్ వర్చువల్‌గా పాల్గొన్నారు. 'గ్లోబలైజేషన్ ఇండియన్ థాట్స్- ఇన్‌సైట్స్ ఫ్రం లీడర్‌షిప్ క్రానికల్స్' అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా ఛటర్జీ మాట్లాడుతూ.. భారతదేశంలోని విభిన్న సంస్కృతులు, భాషలు ప్రతి ఒక్కరికి ఎంతో పరిజ్ఞానాన్ని అందిస్తాయని, అందుకే ఎంతో మంది భారతీయులు విదేశాల్లో రాణిస్తూ గొప్ప పదవుల్లో కొనసాగుతున్నారని తెలిపారు. ప్రపంచంలోని పేరుగాంచిన సంస్థలన్నింటినీ భారతీయులే ముందుండి నడిపిస్తుండటం గర్వించదగిన విషయమన్నారు. ఏ నాయకుడికైనా ఓ పంథా అంటూ ఏమీ ఉండదని, ఎల్లప్పుడూ తన అనుచరులను ప్రోత్సహిస్తూ, ముందుకు సాగడమే నాయకుడి లక్షణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇక్ఫాయ్ సొసైటీ చైర్‌పర్సన్ శోభారాణియశస్వి, వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఎల్‌ఎస్ గణేశ్, సంస్థ విశిష్ట సలహాదారుడు మహేందర్‌రెడ్డి, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ బీజేరావు, రిజిస్ట్రార్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

# కందిలో యాజమాన్య పద్ధతులు ముఖ్యం


రైతులకు అవగాహన కల్పిస్తున్న క్రిడా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు

**క్రిడా కృషి విజ్ఞాన కేంద్రం జిల్లా ప్రధాన శాస్త్రవేత్త చంద్రకాంత్**

షాబాద్: రైతులు కంది పంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని క్రిడా కృషి విజ్ఞాన కేంద్రం జిల్లా ప్రధాన శాస్త్రవేత్త, డాక్టర్ చంద్రకాంత్, జిల్లా వ్యవసాయ శాఖ అదనపు సంచాలకులు సురేష్‌బాబు పేర్కొన్నారు. గురువారం మండలం పరిధిలోని రేగడిదోస్వాడ గ్రామంలో ప్రథమ శ్రేణి క్షేత్ర పథకంలో భాగంగా రైతులకు అధిక దిగుబడి నిచ్చే టీడీఆర్‌జీ 59 తెలంగాణ కంది-3 రకం విత్తనాలు ఇచ్చి సాగు చేయించారు. ఈ సందర్భంగా క్రిడా కృషి విజ్ఞాన కేంద్రం, జిల్లా సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంది పంట క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రైతులు టీడీఆర్‌జీ 59 తెలంగాణ కంది-3 రకం కంది విత్తనాలు సాగు చేసి అధిక దిగుబడులు పొందాలన్నారు. కూరగాయలు, పండ్లు, పూల పంటల ప్రస్తుతం తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. డాక్టర్లు గౌతమ్‌చౌహాన్, శ్రీకృష్ణ మాట్లాడుతూ... శాస్త్రవేతలు సూచించిన సలహాలు, సూచనలు పాటించి అధిక దిగుబడులు పొందాలన్నారు. సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్ మాట్లాడుతూ... రైతు ఉత్పత్తి దారుల సంఘం ఏర్పాటు ప్రయోజనాల గురించి వివరించారు. రైతులకు నేలల సారవంతానికి పచ్చిరొట్ట పైర్లు వేసి భూమిలో కలియ దున్నడం, జీవన ఎరువులు, పంట మార్పిడి చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ అధికారి రామకృష్ణ, ఏఓ వెంకటేశం, అధికారులు సాయివర్ధన్, సాయికుమార్, రైతులు అనంత రెడ్డి, శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, మల్లారెడ్డి, మాధవ రెడ్డి, సురేష్, రఘు, మధుసూదన్‌రెడ్డి, మాణిక్యం, మల్లారెడ్డి, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.